# ఉపాధి పనులకు రూ.37.90 కోట్లతో బడ్జెట్

- 2023–24 సంవత్సరంలో వేతనాలకు రూ 22.74 కోట్లు
- మెటీరియల్‌కు రూ.15.16 కోట్లు
- ఏప్రియల్ నుంచి పనులు ప్రారంభం

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో 2023–24 సంవత్సరంలో పనులు చేపట్టేందుకు ఏలూరు మండల అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం రూ.37.90 కోట్లతో బడ్జెట్ తయారుచేశారు. 8,849 కుటుంబాలకు 100 రోజులు పని కల్పించాలని నిర్ణయించారు.

**ఉపాధితో పాటు అభివృద్ధి**

ఈ ఏడాది చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్ల లంక, పైడిచింతపాడు, కోమటిలంక, పెదయాగనమిల్లితో పాటు కలకుర్రు, శ్రీపర్రు, మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, మల్కాపురం గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహించనున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకు అధికారులు రూ.22.74 కోట్ల పనులు చేపట్టనున్నారు. కూలీలు ఈ మొత్తం పనులు పూర్తి చేస్తే ప్రభుత్వం అదనంగా మరో రూ.15.16 కోట్ల మెటీరియల్ రూపంలో మంజూరు చేయనుంది. అంటే కూలీలకు పని కల్పించడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులకూ నిధులు మంజూరు చేయనుంది.

**పనిదినాల పెంపు**

అధికారులు ఈ ఏడాది పని దినాలు పెంచారు. గత ఏడాది 6,43,466 పనిదినాలు కల్పించగా, ఈ ఏడాది మరో 2,44,434 పని దినాలు పెంచారు. మొత్తంగా 8,87,900 పని దినాలు కూలీలకు అందుబాటులో ఉన్నాయి. ఏడాదికి ఒక్కొక్క కూలీకి కనీసం 100 రోజుల పని దొరుకుతుంది. రోజుకు రూ.257 వేతనం అందుకోవచ్చు. మొత్తంగా 100 రోజులకు రూ.25,700 తమ ఖాతాలో జమ చేసుకోవచ్చు. గత ఏడాది ఒక్కొక్క కూలీ సుమారు 76 రోజులు పని చేశారు. ఇప్పుడు ఈ సంఖ్య 100కు చేరాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం గ్రామాల్లో పంట కాలువ, తాగునీటి చెరువులు, డ్రెయిన్ల పూడిక పనులు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.



గత ఏడాది కోటేశ్వరదుర్గాపురం వద్ద చెరువు పూడిక తీస్తున్న కూలీలు



మల్కాపురంలో పంటకాలువ పూడిక తీస్తున్న కూలీలు (ఫైల్)

### కూలీలందరికీ పని



ఏలూరు మండలంలో 8,849 కుటుంబాలకు ఉపాధిహామీ జాబ్‌కార్డులు అందించాం. గత ఏడాది మొత్తంగా రూ.27.56 కోట్ల ఉపాధి పనులు పూర్తి చేశాం. ఈ ఏడాది లేబర్ బడ్జెట్ రూ.37.90 కోట్లకు పెంచాం. గత ఏడాది కంటే ఈ ఏడాది కూలీలకు మరో 2.44 లక్షల పని దినాలు పెంచాం. కూలీలకు చేతినిండా పని కల్పించాం.

– కిషోర్, ఏపీఓ

### పనితోపాటు అభివృద్ధికి నిధులు



గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కొన్ని గ్రామాలకే పరిమితమైంది. కొందరికే పనులు కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది. కరోనా సమయంలోనూ ప్రభుత్వం కూలీలకు పని కల్పించింది. ఇప్పుడు పనితో పాటు గ్రామాభివృద్ధికి రూ.కోట్ల మెటీరియల్ నిధులు రూపంతో వెచ్చిస్తుంది.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

## పథకాల మేలు ప్రజలకు వివరించాలి



కోటేశ్వరదుర్గాపురంలో సమావేశమైన నాయకులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తోన్న సంక్షేమ పథకాల ద్వారా జరిగే మేలును ప్రజలకు వివరించాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కొండలరావు, పల్లెం ప్రసాద్, తేరా ఆనంద్ బాపనయ్య, బొల్లిముంత రామ్మోహనరావు, నరహరిశెట్టి రాధాకృష్ణ తదితరులు గ్రామాల్లో పర్యటించారు. కోటేశ్వరదుర్గాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో శ్రీనివాసరాజు మాట్లాడారు. ఈ నెల 25న దెందులూరు నియోజకవర్గం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టాలని కోరారు. కొల్లేరు గ్రామాల్లో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీ ప్రకటించారని వివరించారు. కొల్లేరు అభివృద్ధికి సైతం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ పరిపాలనపై ప్రజలకు వివరించాల్సిన బాధత్య పార్టీ నాయకులు, కార్యకర్తలపైనా ఉందని అన్నారు. సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు నగరంలో ఉగాది ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీశోభకృతు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు బుధవారం నగరంలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాహిత్య మండలి ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణాపురంలోని ఆ సంస్థ హాలులో ఉదయం 9.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నేతి సత్యనారాయణ పంచాగ శ్రవణం, ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తారు. పీఆర్‌కే కళా ట్రస్ట్ ఉగాది పురస్కారాన్ని పౌరాణిక సంగీత దర్శకుడు వి.సురేష్‌రాజుకు అందజేస్తారు. శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శన, విశిష్ట కళాకారులకు సన్మానాలు చేస్తారు. రామచంద్రరావు పేటలోని శ్రీమత్ మార్కండేయ వేదపాఠశాలలో ఉదయం 10 గంటలకు వేదాంతం విష్ణుప్రసాద్ పంచాగ పఠనం చేస్తారు. హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విజయ గార్డెన్స్‌లోని సంఘ భవనంలో ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తారు. కాశీభొట్ల వెంకట పార్వతీశ్వర శర్మ పంచాంగ శ్రవణం, విశిష్ట సేవకులకు ఉగాది పురస్కారాల ప్రదానం అనంతరం సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. దేవదాయ ధర్మాశాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ కార్యాలయంలో ఉదయం ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నారు.

### గంగానమ్మ సేవలో మేయర్ దంపతులు



గంగానమ్మ ఉత్సవాలకు విచ్చేస్తున్న నగర మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పువీధి 7వ డివిజన్ సచివాలయం సమీపంలోని చిన్న గంగానమ్మవారి ఉత్సవాల్లో మంగళవారం నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. గంగానమ్మ తల్లి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పిల్లంగోళ్ల శ్రీదేవి, సబ్బన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నారా శేషుకు అబ్దుల్ కలాం పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన కృష్ణా గ్రూప్ సంస్థల అధినేత నారా శేషుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సంస్థ ప్రతిష్టాత్మకంగా ఇచ్చే అబ్దుల్ కలాం అంతర్జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్నట్టు నేపాల్ దేశ మొట్టమొదటి ఉప రాష్ట్రపతి పరమానంద జో తెలిపారు. ఈ మేరకు నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో శేషు చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో అన్నపూర్ణ ట్రస్ట్ చైర్మన్ ఆకుల కృష్ణ కిషోర్, కల్కి భగవాన్, మంగేస్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

### ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్‌కు క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 27వ తేదీలోపు ఓఎన్‌జీసీ అధికారిక వెబ్‌సైట్‌లో దరకాస్తు చేసుకోవాలని కోరారు.

### హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో స్వామి వారి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు.

### వీఆర్ఓపై కేసు సరికాదు

ఏలూరు (మెట్రో): గుడివాడ రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఘటనలో విచారణ చేయకుండా ఏకపక్షంగా వీఆర్ఓ అనిల్‌పై కేసు పెట్టడాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్ఓ అనిల్ అంగన్‌వాడీ వర్కర్ అయిన తన భార్యను సోమవారం రైల్వే స్టేషన్ వద్ద దింపేందుకు వెళ్లగా, విజయవాడ ధర్నా నేపథ్యంలో ఆమెను అక్కడే ఉన్న మహిళా పోలీస్ అడ్డుకున్నారని పేర్కొన్నారు. అనిల్ తన భార్యను ఇంటికి తీసుకుపోతానని చెప్పగా కానిస్టేబుల్ ఒప్పుకోలేదని, ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగిందని వివరించారు. ఈ ఘటనపై వీఆర్ఓతో పాటు మహిళా కానిస్టేబుల్‌పైనా కేసు నమోదు చేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరారు.

### కేంద్ర మంత్రిని కలిసిన కేవీ సత్యనారాయణ



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడుతున్న కేవీ సత్యనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసినట్టు నగరానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యుడు, కళారత్న కేవీ సత్యనారాయణ ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులకు కేంద్ర సాంస్కృతిక శాఖ ద్వారా సహాయ సహకారాలు అందించాలని కోరామన్నారు. ఏలూరులో హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించినట్టు తెలిపారు. కళాకారులకు పూర్తి సహకారం అందిస్తామని, హిందూ యువజన సంఘం ఉత్సవాలకు తప్పక వస్తానని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

### 23న భగత్ సింగ్ వర్ధంతి సభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 23న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ పీడీఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించే భగత్ సింగ్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.మోహన్ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించే ఈ సభలో ఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే భాష, పీడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాల్గొంటారని తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం

- మేయర్ షేక్ నూర్జహాన్
- పాఠశాల్లో రాగి జావ పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భావి భారత పౌరులైన విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రధాన లక్ష్యమని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. స్థానిక 50వ డివిజన్ ఎంఆర్‌సీ కాలనీ స్కూల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. బడి పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన అని, జగనన్న గోరుముద్దలో భాగంగా మరో పోషకాహారం రాగి జావను విద్యార్థులకు ఉదయం పూట అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించగలుగుతున్నామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. వారానికి మూడు రోజులు ఉదయం పూట రాగిజావ విద్యార్థులకు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు, గాడి బాలాజీ, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- తూర్పువీధి 7వ డివిజన్‌లో శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్‌లో కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవితో కలిసి రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోల్ల శ్రీలక్ష్మి విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి ఉన్నత ఆశయాలు, ఆలోచనల్లోంచి పుట్టుని ఈ పౌష్టికాహార పంపిణీని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులు కావాలని శ్రీలక్ష్మి సూచించారు.
- శనివారపు పేట మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్ పాల్గొని మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎర్ర దుర్గాదేవి, వైస్ చైర్మన్ మామూల్ల మమత, ప్రధానోపాధ్యాయని సౌమ్య రాణి తదితరులు పాల్గొన్నారు.

**ఏలూరు మండలంలో..**

ఏలూరు రూరల్: ఏలూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. పోణంగి పాఠశాలలో ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు దారపు తేజ పిల్లలకు రాగి జావ పంపిణీ చేశారు. పైడిచింతపాడు ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, వడ్డి కార్పొరేషన్ డైరక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లెం ప్రసాద్, తేరా ఆనంద్, 15 డివిజన్‌లో కార్పొరేటర్ తంగెళ్ల రాము పిల్లలకు రాగి జావ అందించారు. మాదేపల్లి పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి.ప్రణవి పరిశీలించారు. శనివారపుపేట కుమ్మరిరేవు పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లలకు రాగి జావ అందజేశారు. కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరావు తదితరులు ప్రభుత్వం పిల్లలకు రాగి జావ అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థినితో రాగి జావను తాగిస్తున్న మేయర్ నూర్జహాన్



శ్రీకృష్ణ దేవరాయ పాఠశాలలో రాగి జావ అందిస్తున్న పి.శ్రీలక్ష్మి, శ్రీదేవి



శనివారపు పేట స్కూల్‌లో రాగిజావ అందిస్తున్న వైఎస్సార్ టీఎఫ్ నేత సుధీర్



పోణంగిలో రాగిజావ అందిస్తున్న నాయకులు

## నూకాలమ్మ కటాక్షం నగర ప్రజలపై ఉండాలి



ఎమ్మెల్యే నానికి జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు



మేయర్ నూర్జహాన్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మవారి కరుణాకటాక్షం నగర ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆకాంక్షించారు. నూకాలమ్మవారి జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి భారీ ఊరేగింపును నాని ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నూకాలమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని నాని హామీ ఇచ్చారు. నానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక, అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఉదయం నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. వారి వెంట నగర డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నక్కా నాగేశ్వర రావు, గొంతిన రామకృష్ణ, వెల్లంకి రాజు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నగర వీధుల్లో మేళ తాళాలు, బాణసంచా శక్తి వేషాలు, బాణసంచా కాల్పుల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకుడు మంత్రవాది రామకృష్ణ యోగానంద శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎ.రవిశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### 23న యువ ఉత్సవ్

ఏలూరు రూరల్: వట్లూరు రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జిల్లా యువ ఉత్సవ్ కార్యక్రమం ఈ నెల 23న నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యువ అధికారి దూలం కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర క్రీడల, యువజన వ్యవహారాల శాఖ ఆదేశాల మేరకు యువ ఉత్సవ్ ఇండియా 2047 అనే అంబ్రెల్లా ప్రోగ్రామ్ ద్వారా స్థూల అవుట్రోచ్ మెగా ప్రోగ్రామ్ చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్, స్వాతంత్ర పోరాట ఆదర్శాలు, విలువుల వ్యాప్తి, విభిన్న ఆధ్యాత్మిక, సంస్కృతి వారసత్వం తదితర అంశాలపై ప్రశంగం, చర్చ, పోటీ నిర్వహిస్తామని వివరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆసక్తి, ఉత్సాహం గల యువతీ, యువకులు పాల్గొనాలని, ప్రతిభ చాటిన వారికి బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.



### ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయటమే వెంకటస్వామికి అర్పించే నివాళి అని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పేర్కొన్నారు. యూటీఎఫ్ ఆవిర్భావ నాయకుడు, అమరజీవి వెంకటస్వామి వర్ధంతి సభ మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు మాట్లాడుతూ అప్పారి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ శ్యాం బాబు, ఉపాధ్యక్షులు బి.సుభాషిణి, కోశాధికారి షేక్ ముస్తఫాలీ, తదితరులు పాల్గొన్నారు.

### చేతివృత్తిదారులను ఆదుకోవాలి



కలెక్టర్ వెంకటేష్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): చేతివృత్తిదారులకు బడ్జెట్లో రూ.50 వేల కోట్లు కేటాయించాలని, సామాజిక రక్షణ చట్టం చేయాలని, 56 వృత్తులకు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని, సమగ్ర కుల గణన చేయాలని కోరుతూ ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతి వృత్తిదారుని కుటుంబం సంక్షేమానికి రూ.25 వేలు సాయం, వృత్తి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వృత్తిదారుల కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలని, వృత్తిదారుని కుటుంబానికి 200 యూనిట్ల కరెంటు ఉచితంగా మంజూరు చేయాలని కోరారు. జీఓ 217ను రద్దు చేసి 343 జీఓ ప్రకారం పంచాయతీ చెరువులను స్థానిక మత్స్యకార సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాలని పేర్కొన్నారు. చేనేతపై జీఎస్టీను రద్దు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని వర్తింప చేయాలని కోరారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఎస్సీ, ఎస్టీ తరహాలో ఏర్పాటు చేయాలని, జీఓ 21 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కోకన్వీనర్ ఆగొల్ల కృష్ణారావు, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా నాయకులు గోపాలకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 21 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 37 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 31 |
| ఏలూరు – తిరుపతి(ఇంద్ర) | 19.00 | 34 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 09 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 24 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 12 |
| ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 37 |
| ఏలూరు –ఈసీఐఎల్ | 22.30 | 4814 | 24 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ | 22.15 | 34820 | 13 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ | 09.00 | 4794 | 31 |
| ఏలూరు – విశాఖపట్నం | 12.00 | 4840 | 34 |
| ఏలూరు –విశాఖపట్నం | 22.00 | 4838 | 34 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 29 |